నమస్తే తెలంగాణ
నల్లగొండ

## సూర్యాపేట జిల్లాలో కొత్తగా 11 గ్రామ పంచాయతీలు

- గెజిట్ విడుదల.. 486కు చేరిన పంచాయతీలు

సూర్యాపేట, ఆగస్టు 13 : సూర్యాపేట జిల్లాలో కొత్తగా 11 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఇప్పటి వరకు ఉన్న 475 గ్రామపంచాయతీలకు మరో 11 కలువడంతో జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 486కు చేరింది. ప్రభుత్వ నిర్ణయంతో సూర్యాపేట నియోజకవర్గం పరిధి చివ్వెంల మండలంలోని గుర్రంతండా, సూర్యాపేట మండలంలోని రూప్లాతండా, దుబ్బతండా, కోదాడ నియోజకవర్గం అనంతగిరి మండలంలో అజ్మీర తండా, నడిగూడెం మండలంలోని ఏకలాస్‌పేట తండా, హుజూర్‌నగర్ మండల పరిధి నేరేడుచర్ల మండలంలోని జానలదిన్నె, లక్ష్మీపురం, మేళ్ల చెర్వు మండలంలో దుబ్బతండా, జాజుతండా, గరిడేపల్లి మండలంలో కొత్తగూడెం, తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలంలో గుట్టకింది తండాను గ్రామ పంచాయతీలుగా రూపాంతరం చెందనున్నాయి. ఒకప్పుడు సూర్యాపేట జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు ఉండగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో వాటిని 475 పంచాయతీలకు పెంచి పాలనా సౌలభ్యం కల్పించిన సంగతి తెలిసిందే.



నల్లగొండ ఎస్పీశరత్‌చంద్ర పవార్ సమక్షంలో గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

## రూ.కోటిన్నర గంజాయి కాల్చి బూడిద

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 565కిలోల గంజాయి దహనం

నార్కట్‌పల్లి, ఆగస్టు 13 : నల్లగొండ జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. నార్కట్‌పల్లి మండలం గుమ్మళ్లబావి గ్రామంలో పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ, డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 565 కిలోల గంజాయిని మంగళవారం కాల్చి బూడిద చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 43 కేసుల్లో సీజ్ చేసిన రూ.కోటీ41లక్షల 25వేల విలువైన 565 కేజీల గంజాయిని కోర్టు ఆర్డర్ మేరకు దహనం చేసినట్లు చెప్పారు. యువత డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లైతే టోల్‌ఫ్రీ నెంబర్ 8712670266కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు నాయక్, సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# సర్కారు దవాఖానలకు సమస్యల సుస్తీ

## గాడి తప్పిన ప్రజా వైద్యం

### జిల్లా దవాఖానల్లో మందుల్లేవ్

- వేధిస్తున్న వైద్యుల కొరత.. వసతుల లేమి
- సమయ పాలన పాటించని వైద్య సిబ్బంది
- డాక్టర్ల కోసం గంటల తరబడి పేషెంట్ల ఎదురుచూపులు
- విష జ్వరాల సమయంలో తీవ్ర సమస్యలు

**పేద, మధ్య తరగతి ప్రజల వైద్యానికి భరోసా ఇవ్వాల్సిన సర్కారు దవాఖానలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లే స్థోమత లేక ప్రభుత్వ వైద్యం మీద నమ్మకంతో వస్తున్న రోగులకు అవస్థలు ఎదురవుతున్నాయి. నమస్తే తెలంగాణ బృందం మంగళ వారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రభుత్వ దవాఖాలను విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగుచూశాయి. వసతుల లేమి.. డాక్టర్ల కొరత.. అందుబాటులో లేని పరీక్షలు.. మందులు.. కొరవడిన పారిశుధ్యం.. పని చేయని వైద్య పరికరాలు.. సమయ పాలన పట్టని సిబ్బంది ఇలా అనేక సమస్యలను వివరిస్తూ రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.**



సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో ఒక్క బెడ్‌పై ఇద్దరికి చికిత్స

### సూర్యాపేటలో ఒక్కో బెడ్‌పై ఇద్దరు పేషెంట్లు

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖాన పేరుకే పెద్దాస్పత్రిగా మారింది. రోజు వేయి మంది వివిధ జబ్బులతో ఇక్కడికి వస్తున్నా వారికి అందుతున్న సేవలు మాత్రం అంతంతమాత్రమే. విష జ్వరాలతో వచ్చే రోగులతో ఆస్పత్రి కిక్కిరిసిపోతుండగా వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. 80 బెడ్స్ ఉన్న జనరల్ వార్డులో దాదాపు 110 మంది రోగులను ఉంచారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున ఉంచి వైద్యం చేస్తున్నారు. ఓపీ సేవలు మధ్యాహ్నం వరకే అందుతున్నాయి. మధ్యాహ్నం తర్వాత వైద్యులు ప్రైవేటు ఆస్పత్రిలో విధులకు వెళ్తుంటే ఇక్కడికి వచ్చే రోగులకు మాత్రం వైద్య విద్యార్థులే దిక్కవుతున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రక్త పరీక్షల కేంద్రం టీ హబ్ ఇప్పుడు ప్రజలకు రక్షణ కవచంలా నిలుస్తున్నది. రోజూ వేలాది మంది రోగులకు రక్త పరీక్షలు చేస్తున్నారు. జనరల్ ఆసుపత్రిలో 24 గంటల పాటు ఓపీ సేవలు అందాల్సి ఉండగా కేవలం ఒంటిగంట లోపే అందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మధ్యాహ్నం తరువాత వచ్చే ప్రజలు ఎమర్జెన్సీ వార్డులో వైద్య సేవలు పొందాల్సి ఉంటుంది. అక్కడ కూడా వైద్య విద్యార్థులు మాత్రమే వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో జనరల్ ఆసుపత్రిలో వెయ్యికి పైగా ఓపీ ఉండగా అది ఇప్పుడు 500 నుంచి 600 వచ్చింది. పది రోజులుగా సీజనల్ వ్యాధులు వస్తుండడంతో వెయ్యి వరకు ఓపీ వస్తుండగా, ఇద్దరు మాత్రమే ఓపీ చీటీలు ఇస్తుండడంతో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తున్నది. డాక్టర్లు రాసిన మందులు పూర్తిగా ఆసుపత్రిలోని మెడికల్ షాపులో ఉండకపోవడంతో బయట తీసుకోవాల్సి వస్తున్నది. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది.



సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో ఓపీ చీటీలు ఇచ్చే కౌంటర్లు రెండే ఉండడంతో క్యూలో రోగుల నిరీక్షణ

### తుంగతుర్తిలో డాక్టర్ల కొరత

తిరుమలగిరి(తుంగతుర్తి) : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని 30 పడకల ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గతంలో 100 పడకల ఏరియా దవాఖానగా మార్చారు. ప్రస్తుతం అందుకు అనుగుణంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది కేటాయింపు మాత్రం జరుగలేదు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉన్నతాధికారులు రావులపల్లి పరిధిలోని వెంపటి గ్రామంలో ఆయుష్మాన్ భవన్ మందిరంలో ఏర్పాటు చేశారు. దీని కింద ఏడు సబ్ సెంటర్లు పని చేస్తున్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేయాల్సిన డాక్టర్లు డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై సబ్ సెంటర్లలో పని చేస్తున్నారు. తుంగతుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా, ముగ్గురు సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ మాత్రమే పని చేస్తున్నారు. నలుగురు డాక్టర్లు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ దవాఖానకు నిత్యం 200 నుంచి 300 మంది రోగులు వస్తుండగా, వైద్య పరీక్షలకు ఇబ్బందిగా మారింది.

#### పదైనా డాక్టర్లు రాలేదు



మిర్యాలగూడలో డాక్టర్లు లేకపోవడంతో ఆసుపత్రిలో చూపించుకోవడానికి నల్లగొండ జిల్లా దవాఖానకు వచ్చిన. ఉదయమే వచ్చి ఓపీ రాయించుకున్నా. పది గంటలైనా డాక్టర్లు రాలేదు. అడిగితే లేబర్ రూమ్‌లో మీటింగ్ అంటున్నారు. నాకు ఇది రెండో కాన్పు. ఇంటి వద్ద చిన్న పాప ఉంది. ఇబ్బంది అయితదనే పొద్దుగాల వచ్చిన. అయినా ఫలితం లేకపోయింది.

**-సోనెహా, మిర్యాలగూడ**

#### వీల్ చైర్లు లేవు



జ్వరం, విరేచనాలతో మా అమ్మ ఇబ్బంది పడుతుంటే నిన్న ఆస్పత్రికి తీసుకొచ్చా. ఒంట్లో శక్తి లేక నడువలేకపోతున్నది. పరీక్షలకు తీసుకెళ్లడానికి వీల్ చైర్ కూడా లేదు. ఓపీ వద్దకు వెళ్తే ఎమర్జెన్సీ రూమ్ దగ్గర అంటారు.. అక్కడికి వెళ్తే ఇంకో దగ్గర అంటారు. అరగంట తిరిగితే దొరికింది. దానికి కూడా ఒక కాలు లేదు.

**-జాన్, శాంతినగర్, నల్లగొండ**

#### డాక్టర్ల కొరత ఉంది



ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. వార్డులు, ఓపీకి సరిపడా లేరు. దాంతో సేవలు కొంత ఆలస్యం అవుతున్నాయి. ఈ విషయం కలెక్టర్, డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. మందులపై కూడా పర్యవేక్షణ చేస్తున్నాం. సర్జికల్ సంబంధించి అత్యవసర మందులు స్టోర్‌లో లేకపోతే ఇతర ఏజెన్సీల నుంచి కొనుగోలు చేస్తున్నాం.

**-డా.రమణమూర్తి, సూపరింటెండెంట్, నల్లగొండ జిల్లా జనరల్ ఆసుపత్రి**

### నల్లగొండలో మందుల్లేవ్..

నల్లగొండ, నీలగిరి : నల్లగొండ జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రిలో మందుల కొరత వేధిస్తున్నది. రోగులు బయటికి వెళ్లి మందులు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్, కడుపునొప్పి, చర్మ వ్యాధులు వంటి సమస్యలకు కూడా మందులు ఉండడం లేదు. తొమ్మిది గంటలకు ప్రారంభం కావాల్సిన ఓపీ సేవలు పది గంటలు దాటితే గానీ ప్రారంభం అవట్లేదు. రోగులు గంటల తరబడి డాక్టర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది. వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. పలువురు డాక్టర్లు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో కొత్తవారు పోవడంతో ఉన్నవారిపైనే పని ఒత్తిడి పెరుగుతున్నదని డాక్టర్లు వాపోతున్నారు. ఆరు విభాగాల్లో 77 మంది డాక్టర్లు, 42 మంది ఎస్ఆర్ ఉండాల్సిండగా కేవలం 33 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. నరాల వైద్య నిపుణులు, నెఫ్రాలజిస్టులు లేరు. ఉన్న డాక్టర్లు కూడా బయట ప్రైవేట్ క్లినిక్స్, లేదా సొంత ఆస్పత్రుల్లో పని చేసి ఆలస్యంగా రావడం వల్ల ఓపీ లేట్ అవుతుందని రోగులు చెప్తున్నారు. ఆస్పత్రిలో 650 పడకలు ఉండగా, ప్రస్తుతం ఉన్న సిబ్బంది 400 పడకలకు సరిపోను మాత్రమే ఉన్నారు.



నల్లగొండ మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న గర్భిణులు, వారి సహాయకులు

### నల్లగొండ జిల్లా దవాఖానలో ఇదీ పరిస్థితి

| విభాగం | ఉండాల్సిన డాక్టర్లు | ఉన్న డాక్టర్లు | ఖాళీలు | ఎస్ఆర్‌లు |
|---|---|---|---|---|
| జనరల్ మెడిసిన్ | 15 | 5 | 10 | 9 |
| పిడియాట్రిక్ | 8 | 4 | 4 | 5 |
| జనరల్ సర్జన్ | 15 | 6 | 9 | 9 |
| ఆర్థోపెడిక్ | 9 | 3 | 6 | 3 |
| ఓబీసీ | 15 | 5 | 10 | 5 |
| అనస్తీషియా | 15 | 10 | 5 | 11 |
| | 77 | 33 | 44 | 42 |



ఖాళీ కనిపిస్తున్న దేవరకొండ ఏరియాగా ఆస్పత్రిలోని డాక్టర్ల కుర్చీలు

### కోదాడలో సగానికి పడ్డ ప్రసవాల సంఖ్య

కోదాడ : కోదాడ 30 పకడల దవాఖాన అరకొర వసతులతో నడుస్తున్నది. 200 నుంచి 300 మంది వరకు ఓపీ ఉంటున్నది. 16మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం సూపరింటెండెంట్‌తో కలిపి నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు జనరల్ సర్జన్లు, ఒక పిల్లల వైద్యుడితోపాటు కాంట్రాక్ట్ పద్ధతిలో గైనకాలజిస్ట్ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు ప్రసూతి వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక్కరే ఉండడంతో ప్రసవాల సంఖ్య పడిపోయింది. గతంలో ఇక్కడ నెలకు 50కి పైగా ప్రసవాలు జరుగగా ఇప్పుడు 20లోపు మాత్రమే జరుగుతున్నాయి. దయాలసిస్ సెంటర్‌కు మినహా మిగతా విభాగాలకు జనరేటర్ సౌకర్యం లేదు.

### హుజూర్‌నగర్‌లో ఓకే..

హుజూర్‌నగర్ : 100 పడకల సామర్థ్యం గల హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి జ్వరాలతో ఎక్కువమంది రాగా, వైద్యులు అందుబాటులో ఉన్నారు. దవాఖాన సిబ్బంది , మందుల కొరత లేదు. కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

### మిర్యాలగూడలో పరీక్షలు ప్రైవేట్‌కే..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి వైద్యులు సమయానికి రావడం లేదు. డెంగ్యూ, చికుగున్యా వ్యాధుల నిర్ధారణకు అవసరమైన కిట్లు లేకపోవడంతో రోగులను ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. రోగులు అధిక సంఖ్యలో వస్తుండగా, 12:30 గంటలకే ఓపీ బంద్ చేయడంతో చాలామంది వెనుదిరుగుతున్నారు. రోడ్డు ప్రమాదాల కేసులు వస్తే చికిత్స అందించకుండా జిల్లా దవాఖాకు రెఫర్ చేస్తున్నారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.

#### వీల్ చైర్లు లేవు



ఇటీవల మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో తుంటి ఎముక ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు చెకప్ కోసం వచ్చాను. ఆర్థో విభాగం పైఅంతస్థులో ఉంది. సరిపడా వీల్‌చైర్లు లేకపోవడంతో ఇబ్బంది అవుతున్నది. డయాలసిస్ కోసం వచ్చే వాళ్లదీ ఇదే పరిస్థితి.

**-కోటేశ్వరమ్మ, మిర్యాలగూడ**

### నకిరేకల్‌లో చాలని బెడ్లు

కట్టంగూర్ : సీజనల్ వ్యాధుల కారణంగా నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో రోజూ 300 నుంచి 400 ఓపీ నమోదవుతుండగా, ప్రస్తుతం 30 పడకలు మాత్రమే ఉన్నాయి. బెడ్స్ సరిపోకపోవడంతో గైనకాలజీ వార్డులోని 5 బెడ్స్‌ను వాడుకుంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 30 పడకలను 100 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. రూ.32 కోట్లతో చేపడుతున్న పనులు 80 శాతం పూరయ్యాయి.

### దేవరకొండలో పని చేయని ఎక్స్‌రే మెషీన్

చందంపేట(దేవరకొండ) : దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం10 తర్వాత నుంచి 11 గంటల వరకు ఒక్కొక్కరుగా విధులకు హాజరయ్యారు. స్కిన్ డాక్టర్ ఆలస్యంగా రావడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఆస్పత్రిలోని ఎక్స్‌రే మెషీన్ వారం నుంచి పని చేయకపోవడంతో రోగులు బయటకు వెళ్లి ఎక్స్‌రే తీయించుకుంటున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో దోమల బెడద అధికంగా ఉంది.

### పీఏపల్లిలో ఒక్కరే డాక్టర్

పీఏపల్లి పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు అందాల్సి ఉండగా, సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో సాయంత్రం ఐదు దాటితే బంద్ పెడుతున్నారు. గతంలో ఇక్కడున్న ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సుల్లో స్టాఫ్ నర్సులు బదిలీపై వెళ్లగా, ఒక డాక్టర్ డిప్యూటేషన్ మరొక చోటకు వెళ్లారు. ప్రస్తుతం ఒక స్టాఫ్ నర్సు, ఒక డాక్టరు మాత్రం విధుల్లో ఉన్నారు.

### హాలియాలో 24 గంటల సేవల్లేవ్..

హాలియా పీహెచ్‌సీలో 24 గంటల వైద్యం అందాల్సి ఉన్నా, వైద్యుల కొరత కారణంగా అది సాధ్యమవడం లేదు. ఒక్క డాక్టరే ఉండడంతో ఆయన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీటి సౌకర్యం లేదు. నిత్యం వంద వరకు ఓపీ నమోదవుతున్నా 8 ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నైట్‌డ్యూటీ స్టాఫ్‌నర్సు లేరు. మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఆస్పత్రిలో గ్యాస్ ట్రబుల్, షుగర్, బీపీ నొప్పుల గోలీలు అందుబాటులో లేవు.

## ఏఎమ్మార్పీ కాల్వలకు నీళ్లివ్వండి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

- ఏడాది కాలంగా అందని సాగునీరు
- తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం
- విదేశాల్లో కాలం గడుపుతూ మాటలతో కోటలు కడుతున్న జిల్లా మంత్రి
- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

నల్లగొండ రూరల్, ఆగస్టు 13 : ఎమ్మార్పీ కాల్వ ద్వారా నల్లగొండ నియోజకవర్గ రైతాంగానికి ఏడాది కాలంగా సాగు నీరు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆవేదన చెందారు. వానకాలం సీజన్‌కు నారుమడులు పోసుకున్నా ఇప్పటికీ సాగు నీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఏఎమ్మార్పీ ద్వారా కనగల్, తిప్పర్తి, నల్లగొండ, మడ్గులపల్లి మండలాలకు చెందిన డి-25, డి -37, డి-39,డి -40 కాల్వలకు వెంటనే సాగు నీరు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ సి.నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ ద్వారా ప్రస్తుతం వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతున్నదని, కనీసం ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా సాగు నీరు విడుదల చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. సీజన్‌కు ముందే మోటార్లు రిపేరు చేయాల్సిన ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. స్థానిక మంత్రి విదేశాల్లో కాలం గడుపుతూ మాటలతో కోటలు కడుతున్నారని గానీ, చేతలు గడప దాటడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ కాల్వలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ట్రయల్ రన్ నిర్వహించిన బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి కూడా నీటిని విడుదల చేసి అక్కడ చెరువులు నింపాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బక్క పిచ్చయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీలు కరీం పాషా, నారబోయిన భిక్షం, బొజ్జ వెంకన్న, మాజీ జడ్పీటీసీలు యాదగిరి, తుమ్మల లింగస్వామి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారయణ, జమాల్ ఖాద్రీ, దోటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ, మండలాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు దేప వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, బడుపుల శంకర్, సందీప్‌రెడ్డి, మెరుగు గోపి, తవిట కృష్ణ, కందుల లక్ష్మయ్య, బద్రి, పిచ్చయ్య పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ జలాశయం

## నిండుకుండలా నాగార్జునసాగర్

నందికొండ, ఆగస్టు 13 : నాగార్జునసాగర్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. పూర్తి స్థాయి సామర్థ్యం 590 (312 టీఎంసీలు) అడుగులకుగానూ మంగళవారం 589.40 (310.2522 టీఎంసీలు) అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నుంచి 47,428 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా ఎడమ కాల్వ ద్వారా 8,629 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 7,086 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల లేదు.

## ధర్మకర్తల మండళ్లకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 13 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో గల పలు దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండళ్ల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన తెలిపారు. ఆసక్తి గల వారు 20 రోజుల్లోగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ నల్లగొండ, హైదరాబాద్ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆయా దేవాలయాల ఈఓ, జిల్లా దేవాదాశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో తెలుసుకోవచ్చని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**దరఖాస్తులు చేసుకోవాల్సిన ఆలయాలు..**

- భక్తాంజనేయస్వామి దేవస్థానం తులసీనగర్, నల్లగొండ
- సీతారామచంద్రస్వామి దేవస్థానం, అన్నెపర్తి, నల్లగొండ మండలం
- భక్తాంజనేయ సహిత సంతోషిమాత దేవస్థానం. షేర్‌బంగ్లా, నల్లగొండ
- రేణుకాఎల్లమ్మ దేవస్థానం, శ్రీనగర్‌కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ
- వేంకటేశ్వరస్వామి దేవస్థానం, మారేపల్లి
- వారిజాల గోపాలస్వామి దేవస్థానం, గోపాలయపల్లి, నార్కట్‌పల్లి మండలం
- వేణుగోపాల స్వామి దేవస్థానం, మాడ్గులపల్లి
- లక్ష్మీనరసింహ్మాస్వామి దేవస్థానం, మాదనపురం, చింతపల్లి మండలం
- సీతారామచంద్రస్వామి దేవస్థానం, బండపాలెం, కేతేపల్లి మండలం
- కోదండ రామచంద్రస్వామి దేవస్థానం, కురుమర్తి, కట్టంగూర్ మండలం
- ఛాయాసోమేశ్వరస్వామి దేవస్థానం, పానగల్, నల్లగొండ మండలం
- అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం
- సూర్యాపేట వేంకటేశ్వర స్వామి దేవాలయం

## వైద్య కళాశాలలో పోస్టులకు 17న ఇంటర్వ్యూలు

నీలగిరి, ఆగస్టు 13 : నల్లగొండ జిల్లా వైద్య కళాశాలలో బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి ఈ నెల 17న ఇంటర్వ్యూ నిర్వహించనున్న కళాశాల సూపరింటెండెంట్ డా.రమణామూర్తి తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు 7, అసోసియేట్ ప్రొఫెసర్లు 17, సీనియర్ రెసిడెంట్స్ తాత్కలిక పద్ధతిని 43 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 17న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

మరిన్ని వివరాలకు ప్రభుత్వ వైద్య కళాశాలలో లేదా nalgonda. telangana.gov.in /www. gmcnal gonda.in ను సంప్రదించాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.